నాగేంద్ర అరెస్టుపై స్పీకర్ ప్రకటన

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి)
మాజీ మంత్రి నాగేంద్ర అరెస్టును శాసనసభలో స్పీకర్ యూటీ ఖాదర్ మంగళవారం ప్రకటించారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో నగదు బదిలీపై ఈడీ అధికారులు నాగేంద్రను అరెస్టు చేశారని వెల్లడించారు. కాగా శాసనసభలో జేడీఎస్ పక్ష నేతగా చిక్కనాయకనహళ్లి సీబీ సురేశ్‌బాబును ఎంపిక చేసినట్టు స్పీకర్ ప్రకటించారు. పరిషత్ జేడీఎస్ పక్షనేతగా ఎస్ఎల్ భోజేగౌడను నియమించినట్టు సభాపతి ప్రకటించారు.

సీఎం రాజీనామాకు పట్టు



సభలో డీకే శివకుమార్, అశ్వత్థనారాయణ వాగ్వాదం

- రెండుసార్లు శాసనసభ సభ వాయిదా
- నాగేంద్రను వెనుకేసుకొచ్చింది ఎవరు..?
- లూటీ పితామహుడు అశ్వత్థనారాయణ
- ఎస్ఎస్ఐటీ వివాదంపై రచ్చరచ్చ
- అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని ప్రతిపక్ష బీజేపీ సభ్యులు పట్టుబట్టడంతో శాసనసభలో గందరగోళం నెలకొంది. వాయిదా తీర్మానానికి అనుగుణంగా ప్రతిపక్షనేత అశోక్ సోమవారం ప్రారంభించిన ప్రసంగాన్ని మంగళవారం ప్రశ్నోత్తరాల తర్వాత ప్రారంభించారు. అంతలోనే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఇరు పక్షాలు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. సభ సాధారణ పరిస్థితికి తీసుకొచ్చేందుకు స్పీకర్ యూటీ ఖాదర్ తీవ్రంగా ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో 10 నిమిషాలపాటు వాయిదా వేశారు. 45 నిమిషాల తర్వాత సభ ప్రారంభం కాగా స్పీకర్ యూటీ ఖాదర్ ఇరువైపుల సభ్యుల వాగ్వాదాలను రికార్డుల నుంచి తొలగిస్తానని ప్రకటించారు. బీజేపీ సభ్యుడు సురేశ్‌కుమార్ జోక్యం చేసుకుని ఇదేం గతంనాటి సభా కాలం కాదని తెలిపారు. అప్పట్లో ప్రింట్ మీడియా మాత్రమే ఉండేదని, వారు రికార్డులలో లేని అంశాలను ప్రచురించేవారు కాదన్నారు. కానీ ప్రస్తుతం లైవ్ టెలికాస్ట్ ఉండడంతో ఇప్పటికే ఎవరేం మాట్లాడారో రాష్ట్రమంతటా చూశారని, రికార్డుల ద్వారా తొలగిస్తే ప్రత్యేకత ఏమీ ఉండదని అన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ స్పందిస్తూ చరిత్రకు వెళ్లకుండా ఉండాలని రికార్డుల నుంచి తొలగిస్తారని అన్నారు.

నాగేంద్రను వెనుకేసుకొచ్చింది ఎవరు..?

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో కోట్లాది రూపాయల అవినీతి జరిగినా మాజీ మంత్రి నాగేంద్రను వెనుకొసుకొచ్చిన శక్తి ఎవరని ప్రతిపక్షనేత అశోక్ ప్రశ్నించారు. రూ. 187 కోట్ల అవినీతి జరిగి ఉంటే ముఖ్యమంత్రి తనకు సంబంధం లేదు అంటున్నారని, గ్రాంటు విడుదల చేసేవరకే తమ బాధ్యత అని ఆర్థికశాఖ దాటవేస్తోందని అన్నారు. మరి దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. కార్పొరేషన్‌లో సాగిన అవినీతితో కనీస సంబంధం లేకుండా ఉత్తమ ఉద్యోగి చంద్రశేఖరన్ బలి అయ్యారని, వారి కుటుంబానికి అండ ఎవరని ప్రశ్నించారు. చంద్రశేఖరన్ ఆత్మహత్య, ఆయన రాసిన లేఖ లేకపోతే ఈ అవినీతి వ్యవహారం బయటకు వచ్చేది కాదన్నారు. చంద్రశేఖరన్ కుటుంబం రోడ్డున పడిందని, భార్యకు వచ్చే 8 వేల జీతంతో ఇద్దరి పిల్లలను పోషించలేక ఇల్లు మారారని అన్నారు. జైలులో ఉన్న నిందితులకు బెయిల్ వచ్చేలా సంతకం కోసం చంద్రశేఖరన్ భార్య చెంతకు వెళ్లారని అశోక్ మండిపడ్డారు.

ఎస్ఎస్ఐటీ వివాదంపై రచ్చరచ్చ

రాష్ట్రంలో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) లేదని సిద్దరామయ్య, శివకుమార్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఎస్ఐటీ) అమలులో ఉందని మాజీ మంత్రి సురేశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రచ్చకు దారితీశాయి. ఇదే అంశంపై అశోక్ మాట్లాడుతూ సిట్ దర్యాప్తు ప్రారంభించి 40 రోజులైనా మాజీ మంత్రి నాగేంద్రకు నోటీసులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు లాంజ్‌లో మాట్లాడుకున్న ఆడియో, వీడియోలపై అశోక్ ప్రస్తావించారు. ఈడీ దర్యాప్తు ప్రారంభించిన వెంటనే నాగేంద్రను అరెస్టు చేశారని పేర్కొన్నారు. కార్పొరేషన్ అసలు ఖాతా వసంతనగర్ యూనియన్ బ్యాంకులో ఉండగా ఇక్కడ ఉండే రూ. 187 కోట్లను ఎంజీ రోడ్డు బ్రాంచ్‌కు ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించారు. బ్యాంకు బదిలీతోనే అవినీతి జరిగిందన్నారు. స్వయంగా సీఎం సిద్దరామయ్య రూ.89 కోట్లు మాత్రమే అవినీతి జరిగిందని ప్రకటించారని, ఇందుకు ఆయన నైతికబాధ్యత వహించాలన్నారు. ఇటీవల రేవణ్ణపై కేసు నమోదు చేసుకున్న సిట్ ఒక రోజులోనే ఆయన ఇంటిపై దాడి చేసిందని, అరెస్టు చేసి జైలుకు పంపిందని, ఆయన భార్య భవానిని అదే తరహాలోనే వేధించిందని మండిపడ్డారు. ప్రజ్వల్ తప్పును సమర్థించడం లేదని, రేవణ్ణ విషయంలో చూపిన ఆత్రుత, నాగేంద్ర కేసులో ఎందుకు కనబరచడం లేదని ప్రశ్నించారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. నగదు మోసం జరిగితే మళ్లీ చెల్లిస్తారని, మహిళలకు జరిగిన అవమానానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

ఇది ట్రైలర్ మాత్రమే: పరిషత్‌లో సీటీ రవి

వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతిపై పరిషత్‌లో తీవ్రమైన చర్చ జరిగింది. బీజేపీ సభ్యుడు సీటీ రవి మాట్లాడుతూ వాల్మీకి కార్పొరేషన్‌లో వందశాతం అవినీతి జరిగిందని పేర్కొన్నారు. అక్రమంగా నగదు బదిలీ చేశారని, ప్రస్తుతానికి మేం వదిలిన సాక్ష్యాలు ట్రైలర్ మాత్రమేనని, సినిమా త్వరలోనే ఉందని తెలిపారు. 68వ నిబంధన కింద రవి మాట్లాడుతూ తమ ప్రభుత్వంపై 40శాతం కమీషన్ అంటూ ఆరోపించారని, వాల్మీకి కార్పొరేషన్‌లో ఏకంగా వచ్చిన గ్రాంట్లను మొత్తం దోచేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో నెంబరు 1, 2లతో సన్నిహిత సంబంధాలు కల్గిన వ్యక్తి సూత్రధారి అన్నారు. వాల్మీకి కార్పొరేషన్ సొమ్ముతో కుటుంబ సభ్యుల పేరిట ఎమ్మెల్యే భూములు, విలాసవంతమైన కార్లు కొన్నారని అన్నారు. దీనిపై అధికార పక్ష సభ్యులు తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరి పేర్లు ప్రస్తావించరాదనే నిబంధన ఉన్నా నెంబరు 1, 2 అంటూ మాట్లాడడం సరికాదన్నారు. మరో నలుగురైదుగురు మంత్రులు రాజీనామా చేస్తారని అన్నారు. ఇదే సందర్భంలో మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకుని మమ్మల్ని ఖాళీ చేసే ముందు మీరు పరిషత్‌లో ప్రతిపక్ష సభ్యుడిని ఎంపిక చేయండంటూ ఎద్దేవా చేశారు. సీటీ రవి మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యుడు యూబీ వెంకటేశ్ పదే పదే అభ్యంతరం తెలపడంపై సభాపతి స్థానంలో ఉన్న ఎంకే ప్రాణేశ్ తీవ్రంగా మందలించారు. సీటీ రవి వ్యాఖ్యలపై జోక్యం చేసుకున్న హోంశాఖ మంత్రి పరమేశ్వర్ ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరికీ ఫోన్ చేయలేదని సిట్, సీబీఐ, ఈడీ సంస్థల దర్యాప్తు చేస్తున్నాయని, పరిమితిలోగానే చర్చించాలని ప్రభుత్వం అన్నింటికీ వివరణ ఇస్తుందన్నారు. ఇదే సందర్భంలో మంత్రి సంతోష్‌లాడ్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో నిలువు దోపిడీ చేశారని ఇప్పుడు సచ్ఛీలురుగా మాట్లాడుతున్నారన్నారు. ఇదే సందర్భంగా పోడియంలోకి బీజేపీ సభ్యులు వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలా రెండో రోజూ సభా కార్యకలాపాలు వాడివేడిగా కొనసాగాయి.



పరిషత్ వెల్‌లో నిరసన

లూటీ పితామహుడు అశ్వత్థనారాయణ

లూటీ కోరుల పితామహుడు మాజీ మంత్రి అశ్వత్థనారాయణ అంటూ ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో ప్రతిపక్షనేత మాట్లాడే ప్రతి సందర్భంలోనూ ముఖ్యమంత్రి సభలో ఉండేవారా..? అని నిలదీశారు. ఎస్ఎస్ఐటీ అంటూ తన పేరు ప్రస్తావించి అవమానం చేశారని, అందుకు సాక్ష్యాలు ఇవ్వాలంటూ నిలదీశారు. అందుకు దీటుగా స్పందించిన అశ్వత్థనారాయణ మాట్లాడుతూ గతంలో తనపై హిట్ అండ్ రన్ అంటూ ఆరోపించలేదా అన్నారు. సీబీఐని హేళన చేయలేదా అంటూ నిలదీశారు. సభలో సీఎం సిద్దరామయ్య ప్రవేశించగానే ప్రతిపక్షనేత అశోక్ 'సీఎం రాజీనామా' చేయాలంటూ డిమాండ్ చేశారు. ఒకానొక దశలో అధికార, ప్రతిపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇదే సమయంలోనే సీఎం సిద్దరామయ్య ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు పెంచిన తీర్మానాన్ని సభకు వివరించారు. ఆ తర్వాత కార్యకలాపాలను భోజన విరామానికి వాయిదా వేశారు



ఎంబీ పాటిల్, యత్నాళ్ వాగ్వాదం



స్పీకర్ యూటీ ఖాదర్ సూచనలు



సభలో సీఎం సిద్దరామయ్య ప్రసంగం



ప్రశ్నిస్తున్న బీజేపీ నేత విజయేంద్ర

ఒక్కసారికే అంత నిరుత్సాహమా..?


నన్ను రెండుసార్లు ఓడించింది మరిచారా..?: డీకే శివకుమార్‌పై నిఖిల్ మండిపాటు



బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఒక్కసారి బెంగళూరు గ్రామీణలో తమ్ముడు ఓడినందుకే అంతగా నిరుత్సాహమైతే ఎలాగని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై జేడీఎస్ యువనేత నిఖిల్ కుమార్ మండిపడ్డారు. రామనగరలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను మండ్య ఎంపీగా, రామనగర ఎమ్మెల్యే స్థానం నుంచి ఓడించలేదా..? అని ప్రశ్నించారు. డీకే శివకుమార్ తమతో కలసి ఉండి రెండుసార్లు తనను ఓడించారని, కానీ తాము ప్రత్యర్థులుగానే బరిలోకి దిగి గెలిస్తే అంతలోనే జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామికి పలు అంశాల్లో డీకే శివకుమార్ సవాల్ విసరడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇలాంటి ఎన్నో సవాళ్లను కుమారస్వామి ఎదిరించారని తెలిపారు. అందుకే రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారని పేర్కొన్నారు. రానున్న నాలుగేళ్లలో పార్టీని సమర్థవంతంగా అభివృద్ధి చేస్తామన్నారు.

నా కొడుకు తప్పు చేసి ఉంటే ఉరి తీయండి

- ప్రజ్వల్ వివాదంపై శాసనసభలో మాజీ మంత్రి రేవణ్ణ



బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): 'నా కొడుకు తప్పు చేసి ఉంటే ఉరి తీయండి'... అంటూ శాసనసభలో మాజీ మంత్రి, జేడీఎస్ నేత రేవణ్ణ విరుచుకుపడ్డారు. ప్రతిపక్షనేత అశోక్ వాల్మీకి కార్పొరేషన్‌కు సంబంధించిన అవినీతి కేసును విచారిస్తున్న సిట్ అధికారుల తీరుకు, ప్రజ్వల్ రేవణ్ణ కేసులో సిట్ ప్రవర్తించిన విధానాన్ని పోల్చారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రిజ్వాన్ అర్షద్, నారాయణస్వామి, నరేంద్రస్వామి తదితరులు అదేం చిన్న కేసా..? అంటూ మండిపడ్డారు. ఒకానొక దశలో మహిళ మర్యాద వెనక్కొస్తుందా అంటూ ప్రశ్నించారు. కోట్ల రూపాయల అవినీతి జరిగి ఉంటే కట్టించవచ్చు అన్నారు. ఇదే సందర్భంలో రేవణ్ణ జోక్యం చేసుకుని తన పేరు ప్రస్తావించారని, తాను మాట్లాడాలంటూ అభ్యంతరం తెలిపారు. తన కుమారుడు తప్పు చేసి ఉంటే ఉరి తీయనీ... డీజీ ఆఫీసులో ఓ మహిళ చేత ఫిర్యాదు రాయించారని ఆరోపించారు. పోలీసు అధికారుల పట్ల అనుచితంగా మాట్లాడారంటూ అధికార పక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి సభ గందరగోళమైంది.

తెరపైకి 'గ్రేటర్ బెంగళూరు'

యలహంక, తుమకూరు, దేవనహళ్లిని కలిపేందుకు కసరత్తు

ప్రతిపాదిస్తున్న పలువురు ఎమ్మెల్యేలు



బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)ని గ్రేటర్ బెంగళూరుగా మార్చేందుకు కసరత్తు చేస్తున్నట్లు చర్చలు జోరందుకున్నాయి. నాడప్రభు కెంపేగౌడ నిర్మించిన బెంగళూరు నగరాన్ని మార్చేందుకు జరుగుతున్న చర్చలపై సర్వత్రా విమర్శలకు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ బెంగళూరు పాలనా బిల్లు-2024 ప్రభుత్వానికి చేరింది. గ్రేటర్ బెంగళూరు ఏర్పాటుకు డీసీఎం, బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా పేరు మార్పు చేసేందుకు ఇప్పటికే సిద్ధమయ్యారు. తాజాగా వారికి అనుకూలం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా మార్చే విషయంపై సమీప ప్రాంతాల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో చేర్చాలనే ప్రస్తావనలు తీసుకొస్తున్నారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ బెంగళూరుకు 70 కిలోమీటర్ల దూరంలో ఉండే సొంత జిల్లా తుమకూరును గ్రేటర్ బెంగళూరులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. యలహంక, హొస్కోటె ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలను బెంగళూరు ఉత్తరగా మార్చాలని ప్రతిపాదిస్తున్నారు. రామనగర మినహాయించి మిగిలిన ఎమ్మెల్యేలందరూ ఇటువంటి ప్రస్తావనలకే డిమాండ్ చేస్తున్నారు. ఆసియా ఖండంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న నగరాలలో బెంగళూరు ముందంజలో ఉంది. అందుకోసమే విస్తరణ పేరిట తమ నియోజకవర్గాలను విలీనం చేసుకోవాలని కోరుతున్నారు. బెంగళూరుకు 27 కిలోమీటర్ల దూరంలో ఉండే హొస్కోటెను బెంగళూరు పరిధిలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఢిల్లీకి ఉపనగరంగా గుర్‌గావ్ ఉన్నట్టే హొస్కోటెను బెంగళూరుకు ఉపనగర చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గత బీజేపీ ప్రభుత్వం హొస్కోటెతోపాటు పలు పట్టణాలను ఉపనగరాలుగా తీర్చేందుకు ప్రయత్నించినా కార్యాచరణ కాలేదు. యలహంక ఎమ్మెల్యే విశ్వనాథ్ దేవనహళ్లిని కలుపుకొని ఉత్తరజిల్లా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బెంగళూరుకు అనుబంధంగా ఉండే తాలూకాలు ఏవీ విలీనం చేసే ప్రతిపాదనలు లేవు. కానీ బృహత్ బెంగళూరు మహానగర పాలికె రద్దు అయి గ్రేటర్ బెంగళూరు పేరిట 5 నుంచి 10 పాలికెలు కానున్నాయి. బెంగళూరు నగరం 974 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని నిర్దేశించారు. అప్పుడు తుమకూరు, హొస్కోటె, బిడదిలోని పలు ప్రాంతాలు విలీనం కానున్నాయి. రామనగర చేరిక అసాధ్యమనే నగరాభివృద్ధి శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇంతకూ బెంగళూరును ఏం చేస్తారనేది ఎవరికీ స్పష్టత లేదు. మూడేళ్లుగా బీబీఎంపీకి పాలకవర్గం లేక అధికారులదే హవాగా మారింది.

అమ్మో.. భారమైందా..!

ఊరెళ్దామమ్మా.. అన్నాడు..
ఎందుకని అడగలేదు..
ఎక్కడికనీ అడగలేదు..
తీసుకెళ్తున్నది..
తన కొడుకే కదా..
కన్నబిడ్డే కదా.. అని..
బయల్దేరింది.. ఆ తల్లి..

రాష్ట్రం దాటి వచ్చారు..
ఊరుగాని ఊరు చేరారు..
ఎక్కడికొచ్చామో..
ఆ వయసుపైబడిన
అమ్మకు అర్థంకాలేదు..
తెలుసుకోవాలని కూడా
అనుకోలేదు..
ఎందుకంటే.. తీసుకొచ్చింది..
తన బిడ్డే కదా అని..

ఇక్కడే ఉండమ్మా..
పని చూసుకొస్తానన్నాడు..
ఎక్కడికని అడగలేదు..
తానూ వస్తానని కూడా అనలేదు..
ఎందుకంటే.. తన బిడ్డే కదా.. అని..

కొడుకొస్తాడు..
ఇప్పుడే వస్తాడు..
ఇంకాసేపటికి వస్తాడు..
అని ఎదురు చూసింది.
సాయంత్రమైనా రాలేదు..
పాపం.. ఏం పనిమీద వెళ్లాడో..

ఎంతటి ముఖ్యమైన పని
కోసం వెళ్లాడో..
ఏం తిన్నాడో.. ఏమో..
అని బిడ్డ గురించే దిగులు..
ఆ తల్లికి.. పిచ్చితల్లికి..
రాకపోతాడా..
నా కోసం నా బిడ్డ రాకపోతాడా..
అని అనుకుంది..

రాత్రయినా.. కొడుకు రాలేదు..


ఇక రాడని తెలిసిపోయింది..
వదిలించుకోవడానికే తీసుకొచ్చాడని..
వదిలేసి.. వెళ్లిపోయాడన్న
కఠోర వాస్తవం తెలిసొచ్చింది..
అమ్మ గుండె బద్దలైంది..
కన్న తల్లి కంట నీరు ఉబికొచ్చింది..
నా బిడ్డకు నేనే భారమయ్యానా..
అని వెక్కి వెక్కి ఏడ్చింది..
కొడుకును చూడకుండా
ఎలా ఉండాలంటూ..
ఎలా బతకాలంటూ..
గుండెలవిసేలా రోదించింది..
ఆ అమ్మ..

నవమోసాలూ మోసి, కనిపెంచిన కన్నతల్లిని నడి బస్టాండులో వదిలేసి వెళ్లాడు ఓ కొడుకు కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురం జిల్లా ఎస్ఆర్ పల్లికి చెందిన 60 సంవత్సరాలు పైబడిన వృద్ధురాలు లక్ష్మికి కుమారుడు తిరుమలేష్, కుమార్తె మంజుల ఉన్నారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కన్న కొడుకే ఆమెను వదిలించుకోవాలనుకున్నాడు. భారంగా భావించాడు. సోమవారం ఉదయం తల్లి లక్ష్మిని తీసుకుని స్వగ్రామం నుంచి బయల్దేరి హిందూపురంలోని ప్రైవేటు బస్టాండుకు చేరుకున్నాడు. అక్కడ దిగగానే.. తనకు చిన్న పని ఉందనీ, చూసుకుని వస్తాననీ, ఇక్కడే కూర్చుని ఉండాలనీ, తర్వాత తీసుకెళ్లానని తల్లికి చెప్పి తిరుమలేష్ వెళ్లాడు. కొడుకు వస్తాడు.. వస్తాడు.. అంటూ ఆ వృద్ధురాలు ఎదురుచూడసాగింది. రాత్రయినా.. కొడుకు రాలేదు. ఎక్కడికెళ్లాలో ఆ వృద్ధురాలికి అర్థంకాలేదు. అక్కడే బిక్కుబిక్కుమంటూ ఉండిపోయింది. విషయం ఎండీఎస్ అల్ ఇందాద్ చారిటబుల్ సభ్యులకు తెలిసింది. వారు అక్కడకు వెళ్లి, వృద్ధురాలిని పలకరించి వివరాలు సేకరించారు. సోమవారం రాత్రి వృద్ధురాలు లక్ష్మిని హిందూపురం పట్టణ పరిధి లక్ష్మీపురంలోని నైట్ షెల్టర్‌లో వదిలారు. ఉదయమే వెళ్లి వృద్ధురాలికి దుస్తులు, తినుబండారాలు అందించి, మానవత్వం చాటుకున్నారు. ఆ వృద్ధురాలి పరిస్థితిని తెలుసుకున్న వారంతా అయ్యో.. పాపం.. అంటూ ఆవేదన చెందారు. కన్న తల్లిని ఇలా వదిలి వెళ్లిపోవడం ఏంటని మండిపడుతున్నారు.

-హిందూపురం అర్బన్



కొడుకు కోసం వేచివున్న లక్ష్మి



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1608.91	1,588.09
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	28,153	5,955
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	211	195
సామర్థ్యం (టీఎంసీలు)	35.47	9.51

21న అడపద అప్పన్న జయంతి



మాట్లాడుతున్న అదనపు జిల్లా కలెక్టర్ మహ్మద్‌జుబేరా

బళ్లారి సిటీ,జూలై 16 : జిల్లాయంత్రాంగం ఆధ్వర్యంలో జూలై21న శివశరణ అడపద అప్పన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని కెస్వాన్ వీడియా హాల్లో మంగళవారం జరిగిన అడపద అప్పన్న జయంతి ముందస్తు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. 21వ తేదీ ఉదయం నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ నుంచి జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేపట్టాలన్నారు. వేదిక కార్యక్రమం నిర్వహించే స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తాగునీటి సౌకర్యం కల్పించాలని శోభాయాత్రకు వాహన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆహ్వాన పత్రికను ముద్రించడం ద్వారా ప్రముఖులను ఆహ్వానించాలని, కళాకారులచే వచన గానం నిర్వహించాలని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జయంతి ఉత్సవాలకు సంబంధించి పలు సలహాలు ఇచ్చారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు, జీపీపీ సహాయ కార్యదర్శి బసవరాజ్ హిరేమఠ్, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీరమాత జిజియాబాయి నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలో విద్యార్థులు

బళ్లారి సిటీ,జూలై 16: చరిత్ర పాఠాలను పిల్లలకు నాటకరూపంలో ప్రదర్శిస్తే పిల్లలు ఆసక్తితో నేర్చుకుంటారని కర్ణాటక రాష్ట్ర క్రియాశీల శిక్షణ వేదిక జిల్లా అధ్యక్షులు రవిచెళ్లగుర్కి తెలిపారు. సంజీవరాయనకోట ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన వీరమాత జిజియాబాయి నాటకాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజాన్ని మార్చడంలో నాటకాల పాత్ర గొప్పదన్నారు. సినిమాలు రాకముందు నాటకాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉండేదని, సినిమా ప్రభావంతో నాటకాలను చూసేవారి సంఖ్య తగ్గిపోయిందన్నారు. వీరమాత జిజియాబాయి, ఛత్రపతి శివాజీ, చన్నభైరాదేవి, బెళవడి మల్లమ్మ, ఝాన్సీరాణిలక్ష్మీబాయి. కిత్తూరు రాణిచన్నమ్మ, పాత్రలు రంజింప చేస్తాయన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు బసవరాజు, దిల్షాద్ బేగం, చన్నమ్మ, సుమతి, సుధా, వైశాలి, శ్వేతా,ఉమ్మేహాని, శశమ్మ,రామాంజినేయులు, గురుప్రసాద్, విద్యార్థి ప్రతినిధి అనుషా తదితరులు పాల్గొన్నారు.

371-జెను అమలుచేయాలి

బళ్లారి సిటీ, జూలై 16: రాజ్యాంగంలోని 371జేను సమర్థవంతంగా అమలుచేయాలని మంగళవారం సిరిగేరి పన్నరాజ్ నేతృత్వంలో కళ్యాణ కర్ణాటక సమితి(హైదాబాద్ కర్ణాటక) డిమాండ్ చేసింది. ఈసందర్భంగా పన్నరాజ్ మాట్లాడుతూ 371జే జారి అయి పది సంవత్సరాలు జరిగినా సమర్థవంతంగా పనిచేయడం లేదన్నారు. ఉద్యోగాలు, బదిలీల విషయంలో అనేక సమస్యలను సృష్టిస్తుందనే ఉద్దేశంతో దీనిని నిరోధించే ప్రయత్నం చేస్తున్నారని హెచ్చరించారు. కేంద్రప్రభుత్వం 2020లో రాష్ట్రానికి ఎయిమ్స్ ఆసుపత్రికి అనుమతి ఇస్తామన్నారన్నారు. కనుక ఎయిమ్స్ ఆసుపత్రిని మంజూరు చేయాలన్నారు. గనుల తవ్వకాల ధూళి కారణంగా ఇక్కడి ప్రజలు క్యాన్సర్ రోగాల బారిన పడుతున్నారని, వారి చికిత్స కోసం బెంగళూరులోని క్యాన్సర్ కిద్వాయ్ ఆసుపత్రి శాఖను, జయదేవ ఆస్పత్రిశాఖను బళ్లారిలో ప్రారంభించాలన్నారు. ర్యాలీ ద్వారా జిల్లాకలెక్టర్ కార్యాలయం చేరుకుని వినతి పత్రాన్ని జిల్లాకలెక్టర్‌కు సమర్పించారు. నిరసన ర్యాలీలో టిజి.విఠల్, సంగకల్లు హేమంత్ రాజ్, విజయకుమార్, అమ్‌ఆద్మి పార్టీ జిల్లాధ్యక్షుడు మంజునాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎక్కడ చూసినా పండుగ పులులే!

కంప్లి, జూలై 17 : మొహరం పండుగ సందర్భంగా గత రెండు రోజుల నుంచి ఎక్కడ చూసినా పులివేషధారులే కనిపిస్తున్నారు. ఈ పండుగ హిందూ ముస్లిం సమాజాన్ని పూర్తిగా ఆకట్టుకుంటోంది. కంప్లి తాలుకా పరిధిలోని ఉప్పరళ్లి, బాలాపురం, తిమ్మలాపురం, గ్రామాల్లో ముస్లింలు లేకపోయినా హిందువులే ముందుకొచ్చి ఈ పండుగను అంగరంగ వైభవంగా చేపడుతున్నారు. ఎమ్మిగనూరు కొందరు గ్రామంలో పులివేషాలతో పూర్తిగా ఆకట్టుకున్నారు. కంప్లి పట్టణంలో ఓ కుటుంబం వారు పులివేషాలు వేస్తున్న పిల్లలకు రూ. 500, పెద్దలకు రూ. 600లు ఇస్తున్నారు. రెండు రోజుల నుంచి పులివేషం చిత్రీకరించే చిత్రగార్ కుటుంబం బిజీగా మారింది. మహిళలు పురుషులు తేడా లేకుండా ఆసక్తి ఉన్నవారిని వీరు పులివేషంతో అలంకరిస్తున్నారు. చిత్రగార్ మాట్లాడుతూ తమకు వంశపారంపర్యంగా వచ్చిన ఈ విద్యతో తమ తాతలు, తండ్రులు మొహరం పండుగలో పులివేషగాళ్లకు మేకప్ వేసేవారని అలాగే తాము కూడా ఈ పులివేష చిత్రణ చేస్తున్నామని తెలిపారు. అచ్చం పులి ఏ విధంగా ఉంటుందో ఆవిధంగా చిత్రీకరిస్తున్నామన్నారు. మొత్తానికి ప్రతి గ్రామంలో ఈ రెండు రోజులు మొహరం పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.



కంప్లి పట్టణంలో పులివేషధారులను రంగులతో అలంకరిస్తున్న దృశ్యం

గ్రామీణ ప్రాంతాల్లో మొహరం వేడుకలు

బళ్లారిరూరల్, జూలై 16 : తాలుకాలోని మోకా ఎర్రగుడి పరమదేవనహళ్లి, కమ్మరచేడు, రూపనగుడి, చాగనూరు, జాల్వాడు పలు గ్రామాల్లో మొహరం పండుగ సందర్భంగా మంగళవారం పీర్లచావిడిలో పీర్లకు భక్తులు చక్కెర చదివింపులు చేసి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో మొక్కులు తీర్చుకునేందుకు చక్కెర తులాభారం నిర్వహించారు. ప్రజలు పెద్దఎత్తున అగ్నిగుండాల్లో చెట్లు తెచ్చి వేశారు.

సిరుగుప్పలో ...

సిరుగుప్ప, జూలై 16 : సిరుగుప్ప పట్టణంలో వాడవాడలా మొహరం వేడుకలు ఊపందుకున్నాయి. పీర్లను ప్రతిష్ఠించిన ప్రతి చోట భక్తులు భక్తిశ్రద్ధలతో ముడుపులు చెల్లించి పూజా కార్యక్రమం నిర్వహించారు. పీర్లకు ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఆంధ్రులు నివసించే 25వ వార్డులో పీర్ల నుంచి భక్తులు ఆశీర్వాదం పొందుతున్నారు. అదేవిధంగా సౌదాగర్ మసీదు ఆవరణలో వెలసిన పీర్లను ఆభరణాలతో అలంకరించారు.



పిల్లలకు చక్కెర తులాభారం వేస్తున్న దృశ్యం



సౌదాగర్ మసీదు ఆవరణలో వెలసిన పీర్లు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నూతన గోశాల ఏర్పాటు



ఉజ్జినిలో గోశాలకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

కంప్లి, జూలై 16 : గతంలో గోశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఉజ్జిని గ్రామంలో ఉజ్జిని పీఠాధిపతులు సిద్ధలింగ శివాచార్యులు ముందుకొచ్చి మంగళవారం గోశాలకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోశాల అంటేనే ఉజ్జిని పీఠం ప్రతి ఒక్కరికీ గుర్తుకు వస్తుందని, కావున గోవులకు ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ముందుచూపుతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. ఉజ్జిని పరిధిలోని గ్రామాలలో రైతన్నలు గానీ, ప్రజలు గానీ ఈ గోశాలను సద్వినియోగం చేసుకోవాలని, మేతలు లేని రైతన్నలు కూడా తమ గోవులను గోశాలలో వదలవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు, రైతన్నలు పాల్గొన్నారు.

కంప్లిలో రెవెన్యూ అదాలత్



అర్జీలు అందిస్తున్న జీనిగనూరు గ్రామస్తులు

కంప్లి, జూలై 16 : రెవెన్యూ శాఖ ప్రజల కోసం లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తుందని, అందులో ప్రజలు వారి సమస్యలు పింఛన్లు, క్యాస్ట్, ఇన్‌కమ్ ఇతరత్రా వాటిని అర్జీ రూపంలో తెలుపుకుని పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ శివరాజ్‌కుమార్ తెలిపారు. కంప్లి పట్టణంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ అదాలత్ కార్యక్రమంలో 24 గ్రామాల ప్రజలు తమ సమస్యలు, అర్జీల రూపంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, షణ్ముఖప్ప, ఆర్ఐ జగదీష్, గ్రామలెక్కల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ హత్య కేసులో నిందితుల అరెస్టు

బళ్లారిరూరల్, జూలై 16 : కుడితిని కార్పెంటర్ హత్యకేసులో ఇరువురిని అరెస్టు చేసినట్లు బళ్లారి ఎస్పీ డాక్టర్ శోభారాణి తెలిపారు. నగరంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కుడితిని పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుల్తాన్‌పురవద్ద జిందాల్ ఐరన్ ఫ్యాక్టరీలో జూన్ 5వ తేదీ జరిగిన హత్య కేసుకు సంబంధించి వీరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేసే మధ్యప్రదేశ్‌కు చెందిన రామ్‌శంకర్ విశ్వకర్మను లావాదేవీల విషయమై తలెత్తిన గొడవలో ఫ్యాక్టరీ ఆవరణలోనే నిందితులు సురేంద్ర, కిషోర్‌లాల్‌లు చంపి మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంకులో పడేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి పలు కోణాల్లో దర్యాప్తు చేసి విషయాలు సేకరించి ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా బళ్లారిలో నగరంలో ప్రధాన రహదారులపై నిత్యం తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను చక్కదిద్దుతామని ఎస్పీ తెలిపారు. పెరిగిన జన సంఖ్యకు అనుగుణంగా రోడ్ల విస్తరణలేక సమస్య ఏర్పడుతోందన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణ వలన వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక ట్రాఫిక్ సమస్య పెద్దదవుతోందన్నారు. త్వరలో ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరిస్తామని వెల్లడించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృతి చెందుతున్నారన్నారు. అయినప్పటికీ చాలా మంది హెల్మెట్ వాడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హెల్మెట్లు తప్పనిసరిగా వాహనదారులు ధరించేలా అవగాహన కల్పిస్తామన్నారు. హెల్మెట్ లేని వారిపై జరిమానాలు విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఏఎస్పీ కేపీరవికుమార్, నవీన్ కుమార్ తోరణగల్లు డీఎస్పీ ప్రసాద్ గోఖలే, సీఐ విశ్వనాథ్ హిరేగౌడ, ఎస్ఐ విరుపాక్షి తదితర పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్పీ డాక్టర్ శోభారాణి

డ్యాంకింద ఏపుగా నారుమళ్లు



దేవసముద్రం వద్ద పెంచుతున్న వరి నారుమళ్లు

కంప్లి, జూలై 16 : టీబీ డ్యాంలో నీటి మట్టం పెరిగే కొద్దీ భూమిపై పచ్చరంగుకూడా పెరుగుతోంది. జలాశయంలో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతుండటంతో రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కంప్లి తాలుకా పరిధిలోని దేవసముద్రం, చిక్కజాగనూరు, జవుకు, గోనాళ్, హంపేదేవనళ్లి, ఎమ్మిగనూరు, తదితర గ్రామాల్లో ఏపుగా నారుమళ్ల పెంపకం చేపడుతున్నారు. అలాగే నది ఒడ్డున బోర్ల కింద కూడా రైతులు వరినారు పెంచుతున్నారు. మరో వైపు నాట్లు కూడా జోరందుకున్నాయి. చిక్కజాగనూరు గ్రామం వద్ద రైతు కుటుంబరావు తమ పొలంలో జీలుగ ఏపుగా పెంచుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలోను, ఖరీఫ్‌లోను ఒకే పంట వేయడం వల్ల భూమి పూర్తిగా సారహీనంగా మారి చౌడు ఏర్పడుతుందని, కావున నాట్లు వేసేలోపుగా జీలుగ పెంచుకుని కాలువకు నీరు వచ్చిన సమయంలో ట్రాక్టర్ ఇనుప చక్రాలతో దమ్ము చే యాలన్నారు. పచ్చిరొట్ట అంతా మట్టిలో కలిపేస్తే అందులో మెగ్నీషియం, పొటాష్ వరి ఎంటకు ఎంతో అనుకూలిస్తుందని తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసును సీబీఐకు అప్పగించాలి



కలెక్టర్‌కు మనవిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

బళ్లారిరూరల్, జూలై 16 : తమిళనాడులో 5వ తేదీన బీఎస్పీ పార్టీ అధ్యక్షులు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసిన నిందితులపై సీబీఐ దర్యాప్తు చేయాలని బళ్లారి బహుజన సమాజ పార్టీ నాయకుడు మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కులాలకు ఎంతో అండగా వుంటూ పోరాటాలు చేస్తున్న బీఎస్పీ పార్టీ నాయకుడు హత్యకు గురికావడం బాధాకరమన్నారు. అనంతరం కలెక్టర్‌కు మనవిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అలీబాబు కొరవల్లి, ఉమాపతి, సుధీర్ కుమార్, రంజిత్, స్మామ్రాట్, కిష్టప్ప, రమేష్, తిప్పేస్వామి, శేఖర్, మంజు, గోవింద, నాగరాజు పాల్గొన్నారు.

ఎండుతున్న మెట్టపంటలు

బళ్లారి సిటీ,జూలై 13: జిల్లాలో వరుణుడు ముఖం చాటేయడంతో సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ముందస్తు వర్షాలకు సాగు చేసిన మెట్ట పంటలు వాడిపోతుండటంతో రైతులు వాన రాక కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ఈసారైనా ఖరీఫ్ కలిసివస్తుందని అన్నదాతలు కోటి ఆశలు పెట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,73,897 హెక్టార్లలో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనావేశారు. ఇందుతో వరాధారం కింద 64953 హెక్టార్లు, ఆయకట్టుకింద1,08,9433 హెక్టారు సాగు చేస్తారని అంచనా వేశారు. సండూరు, సిరుగుప్ప రైతులు ఎక్కువగా వర్షాధారం కింద పంటలు సాగుచేస్తారు. మొక్కజొన్న,కంది,పత్తి, నువ్వులు పంటలు విత్తారు. ఇందుకోసం ఖరీఫ్ పంటకు తగిన విత్తనాలు రైతులకు ఇచ్చామని, ఇంకా విత్తనాలు నిల్వఉన్నాయని, 70వేల మెట్రిక్ టన్నుల ఎరువు నిలువ ఉందని, వ్యవసాయ శాఖ జేడీ సోమసుందర్ తెలిపారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా సంపర్క కేంద్రాల నుంచి విత్తనాల పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు. కాగా బళ్లారి, కంప్లి, కురుగోడు, సిరుగుప్ప తాలూకాల్లో తుంగభద్ర ఆయకట్టుకింద సాగుచేస్తారు. జిల్లాలో ఎక్కువ శాతం తంగభద్ర ఆయకట్టు ఉంది. తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేసిన తర్వాత సాగు ప్రారంభమవుతుంది. దీంతో రైతులు డ్యాం నుంచి నీరు ఎప్పుడు విడుదల చేస్తారా అని ఎదురుచూస్తున్నారు.



వర్షాధారం కింద మొక్కజొన్న పంట



ఎండుతున్న కంది, నువ్వులు తదితర పంటలు

హోసూరు జోన్

రైతు డిమాండ్లపై కిసాన్ మోర్చా వినతిపత్రం



ఎంపీ కె.గోపీనాథ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

హోసూరు, జూలై 16 : రానున్న లోకసభ సమావేశాల్లో రైతుల డిమాండ్లపై యునైటెడ్ ఫార్మర్స్ ఫ్రంట్ సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కోఆర్డినేటర్ అంచెట్టి పళని, తమిళనాడు రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లగుమయ్య కృష్ణగిరి లోకసభ సభ్యుడు గోపినాథను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆ వినతి పత్రంలో ముందుగా 18వ లోకసభ ఎన్నికల్లో కృష్ణగిరి లోకసభ నియోజకవర్గంల్లో పోటీ చేసి విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు. వేతనాలు హామీ కనీసం మద్దతు ధర, సేకరణ, సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణ రద్దు వంటి రైతుల దీర్ఘకాలిక డిమాండ్లను అందులో పేర్కొన్నారు. డిసెంబర్ 9, 2021 నాటి ఒప్పందాన్ని ఉల్లంఘించినందుకు జాతీయ అసెంబ్లీ అప్పటి నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ప్రభుత్వాన్ని బాధ్యులను చేసిందని పేర్కొన్నారు. లక్షల మంది రైతుల కష్టాల నేపథ్యంలో ప్రస్తుతం భారతదేశంలోని శ్రామిక ప్రజలు విస్తృతమైన అప్పులు, నిరుద్యోగం, పెరుగుతున్న ధరల వంటి తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. భారతదేశంలో రోజుకు 31 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తీవ్రమైన వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలు, గ్రామీణ, పట్టణాల వలసలు పెరుగుతున్న వేతన అసమానతలు, సంపద సమానత వంటి డిమాండ్లను నొక్కి చెబుతూ ఆందోళనను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ తరలింపు

హోసూరు(క్రైం) జూలై 16 : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న యువకుడిని ప్రత్యేక బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. అలాగే బియ్యాన్ని తరలించేందుకు ఉపయోగించిన కారును కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రజాపంపిణీ పథకం బియ్యాన్ని అక్రమంగా తరలించి నిల్వ వుంచే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయిస్ క్రైమ్ ఇన్వేస్టిగేషన్ విభాగం పోలీస్ సిఫ్ కాట్ జోసినిర్మల్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో కోయంబత్తూరు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విజయకుమార్, నేతృత్వంలో తనిఖీ నిర్వహించారు. క్రైం ఇన్వేస్టిగేషన్ విభాగం పోలీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు పెరియస్వామి పెరుమాళ్ నేతృత్వంలో మంగళవారం కొనసాగుతున్న పర్యవేక్షణలో దొంగల అక్రమ రవాణా పై తళి, ఆనేకల్ రోడ్డు ఉద్దన్నపల్లి మునియప్పన్ ఆలయ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో 40 కిలోల బరువున్న 220 బస్తాల్లో 800 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్న వారు పారిపోగా, వాహనం నడుపుతున్న కృష్ణగిరి జిల్లా తళి కుంబార్‌రోడ్డుకు చెందిన ప్రకాశ్(35)ని అదుపులోకి తీసుకుని ఇన్వేస్టిగేషన్ విభాగం వారు కస్టడీలోకి తీసుకున్నారు.



వాహనంతో సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుంటున్న దృశ్యం

బొమ్మనాళలో అగ్నిగుండంలో పడి వ్యక్తి మృతి



యమనప్పను రక్షించేందుకు ప్రజల యత్నం

రాయచూరు, జూలై 16: మొహరం పండుగ సందర్భంగా సోమవారం రాత్రి అలాయ ఆడేందుకు వెళ్లిన వ్యక్తి ఒకరు అగ్నిగుండలో పడి మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన జిల్లాలోని సింధనూరు తాలూకా యు బొమ్మనాళ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యమనప్ప నాయక్(45) పీర్లపండుగ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పీర్లమసీదు ముందు ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అలాయ ఆడేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అదుపు తప్పి పడిపోయిన ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో మృత్యువాతపడ్డాడు. మృతుడి భార్య మహాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తుర్విహాళ్ ఎస్ఐ సుజాత నాయక్ తెలిపారు.

బస్సు బోల్తా .. విద్యార్థినికి తీవ్ర గాయాలు

రాయచూరు, జూలై 16 : రాయచూరు తాలూకాలోని కొర్విహాళ్ గ్రామం నుంచి సగమకుంటా మీదుగా రాయచూరుకు వస్తున్న బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో డ్రైవర్ సగమకుంటా వద్ద బస్సును రోడ్డు పక్కన ఆపే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు పూర్తి మెత్తబడి ఉండడంతో ఒక్కసారిగా బస్సు రోడ్డు కిందికి కూరుకుపోయింది. దీంతో బస్సు బోల్తాకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థుల్లో 15 మందికి మాములు గాయాలు కాగా వారిని ప్రాథమిక చికిత్స అనంతరం పంపించి వేశారు. కొర్విహాళ్‌కు చెందిన 9వ తరగతి చెదువుతున్న సంగీతా అనే బాలిక తీవ్రంగా గాయపడడంతో మెరుగైన చికిత్స కోసం ఆమెను జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

విషయం తెలుసుకున్న రాయచూరు రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లన్ని దెబ్బతిన్నాయని గుంతలమయంగా మారి ప్రయాణానికి అనువుగా లేవంటూ పలు సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించడం లేదంటూ ప్రయాణీకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కావ్య్...

ఆడంస్మిత్ (వర్ధంతి)



స్కాట్లాండ్ దేశానికి చెందిన ఆడంస్మిత్ 1723 జూన్ 5న జన్మించారు. తత్వవేత్త, ఆర్థిక వేత్తగా రాణించారు. 'ది ఫాదర్ ఆఫ్ ఎకనామిక్స్' లేదా 'ది ఫాదర్ ఆఫ్ కేపిటలిజం'గా పేరొందారు. రాజకీయ, ఆర్థిక విధానాలకు చక్కటి బాటలు వేశారు. స్కాట్లాండ్ దేశ పురోగతిలో కీలకంగా వ్యవహరించారు. సామాజిక విలువ, ఆర్థిక అంశాలపై పలు రచనలు చేశారు. 'వెల్త్ ఆఫ్ నేషన్స్' పుస్తకం ఎంతో పేరొందింది. 1790 జూలై 17న కన్నుమూశారు.

నికోలస్-2 (వర్ధంతి)




రష్యా సామ్రాజ్య చివరి చక్రవర్తి సీజర్ నికోలస్-2 1868 మే 18న జన్మించారు. అసలు పేరు నికొలై అలెగ్జాండ్రోవిచ్ రోమనోవ్. 1894 నుంచి తుదిశ్వాస వరకు పాలనలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. ప్రత్యేకించి హక్కులు, విద్యా విధానాలు, పరిపాలన విధానాలకు బాటలు వేశారు. దేశం ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం కావడానికి ఎంతో కృషి చేశారు. రష్యన్ ఆర్థడాక్స్ చర్చ్‌కు సెయింట్ నికోలస్‌గా వ్యవహరించారు. 1918 జూలై 17న హత్యకు గురయ్యారు.

కాంగ్రెస్ బలోపేతానికి ఫలితాలే రుజువు

» మంత్రి సతీశ్ జార్కిహొళి

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి శాసనసభ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలే రుజువు అని మంత్రి సతీశ్ జార్కిహొళి వెల్లడించారు. కాంగ్రెస్ కార్యాలయంలో కేపీసీసీ ఎస్సీ విభాగం ప్రత్యేక కార్యాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ముఖ్యులు, కార్యకర్తలు రాష్ట్రంలో ప్రజలకు అవగాహన కల్పించి ఓట్లు వచ్చేలా శ్రమించారన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందినవారి సంపూర్ణమద్దతు ఇచ్చారని కొనియాడారు. మహారాష్ట్ర మాజీ మంత్రి జాతీయ కాంగ్రెస్ ఎస్సీసెల్ చైర్మన్ శివాజీరావ్ మోగె మాట్లాడుతూ దేశంలో ఎస్సీలు 6కోట్లమంది ఉన్నారని, లోక్‌సభ, శాసనసభలోనే కాకుండా స్థానిక సంస్థల్లోనూ ప్రాధాన్యత ఇస్తే పార్టీకోసం అంకితభావంతో ఉంటారన్నారు. ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు విజయానాయక్, మాజీ ఎమ్మెల్యే కృష్ణమూర్తి, ధర్మసేన, జీఆర్ దినేశ్, లక్ష్మీవెంకటేశ్, షౌకత్‌అలి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేపీసీసీలో ఎస్సీసెల్ విభాగం ప్రారంభంలో మంత్రి సతీశ్ జార్కిహొళి తదితరులు

148 పాఠశాలల విద్యార్థులకు ఏబీబీ శిక్షణ

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఏబీబీ సంస్థ సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మ్యాథ్స్ అవేర్‌నెస్ ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరికల్ స్కిల్ ప్రోగ్రామ్‌ను విద్యార్థులకోసం అమలు చేస్తోంది. 148 ప్రభుత్వ పాఠశాలల్లోని సుమారు 10వేలమంది విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో శిక్షణలు ఇవ్వదలిచారు. పీణ్యా పరిధిలోని 50, నెలమంగల పరిధిలోని 98 పాఠశాలలో నైపుణ్యత, చర్చాగోష్టుల ద్వారా విద్యార్థులలో చైతన్యం తీసుకొస్తున్నారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌సాయంతో పరిసరాల పరిరక్షణపై అవగాహన కల్పించదలిచినట్టు ఏబీబీ ఇండియా మోషన్ ప్రెసిడెంట్ సంజీవ్ అరోరా తెలిపారు. 2022లో ఈ విధానం ప్రారంభించామన్నారు. లీలా పూనావాల ఫౌండేషన్ సాయంతో ఎస్‌టీఈఎంలో నైపుణ్యత ఇస్తున్నామన్నారు. ఏబీబీకి 140ఏళ్ల పరంపర ఉందని లక్షమందికిపైగా ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు.



విద్యార్థులతో ఏబీబీ సంస్థ పదాధికారులు

తూబగెరె గ్రామంలో సందడి



దొడ్డబళ్ళాపుర, జూలై 16: తాలూకాలోని తూబగెరె గ్రామంలో 600 సంవత్సరాలుగా ఆచరిస్తున్న పారంపర్య జానపద భూత నెరిగె కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో నిర్వహించేలా తీర్మానించారు. ఏటా ఆషాఢ మాసం తొలి ఏకాదశి మరుసటి రోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. కరియణ్ణ - కెంచణ్ణల వేషధారణతో భూతాన్ని ఆహ్వానిస్తారు. వేషధారులు ఇంటిముంగిటకు వస్తే సదరు ఇంటిదారులకు ఆకలి బాధ ఉండదని, ఇంట్లో దెయ్యాల భూతాలు ఉండవని గ్రామస్తుల విశ్వాసంగా ఉంది. భూత నెరిగె ఆచరణ సమితి చిదానంద గురూజీ మాట్లాడుతూ విష్ణువు ద్వారపాలకులు జయ విజయలు శాపాకిఇ గురై కరియణ్ణ, కెంచణ్ణలుగా భూలోకానికి వచ్చారనే చారిత్రాక నేపథ్యం ఉందన్నారు. సుమారు ఐదారు వందల సరంవత్సరాలుగా భూతనెరిగె పండుగ తూబగెరె, కల్లుకోటె గ్రామాలలో కొనసాగుతోందన్నారు. విష్ణు నామస్మరణను సహించని కరియణ్ణ, కెంచణ్ణలు భక్తులపై కోపంగా వస్తారని ఈ వేళ అరటిపండు, పనసపండుతో తయారు చేసిన పదార్థాలను తినిపిస్తే వారు శాంతిస్తారన్నారు.

కరియణ్ణ, కెంచణ్ణ వేషధారుల సన్నాహకం

చిరుధాన్యాల ప్రాధాన్యంపై అవగాహన

శిడ్లఘట్ట, జూలై 16: బెళ్ళూటి డివిజన్ మళమాచనహళ్ళి పరిధిలోని తాదూరు గ్రామంలో భారతాంబె జ్ఞానవికాస కేంద్రం సభ్యులకు పౌష్టికాహారం, తృణధాన్యాల వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యకేంద్రం జూనియర్ సహాయకురాలు నీలమ్మ, కేంద్రం అధ్యక్షులు పద్మమ్మ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. జ్ఞానవికాస కార్యక్రమ అధ్యక్షురాలు డాక్టర్ హేమావతి వి హెగ్డే అధ్యక్షతన సాగుతున్న కార్యక్రమంలో పౌష్టిక ఆహార, సిరిధాన్యాల వాడకం కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. తృణధాన్యాలాలలో పోషకాంశాలతోపాటు, రోగనిరోధకశక్తి ఎక్కువగా ఉంటాయన్నారు. మధుమేహం, థైరాయిడ్, అస్తమా, కేన్సర్, హృద్రోగం వంటి వాటిని అధిగమించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయన్నారు. సామెలు, నవనె, రాగులు, సజ్జలు, జొన్నలు వంటివి వేటికవే ప్రత్యేకత కలిగి ఉంటాయన్నారు. సభ్యులు సిరిధాన్యాల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జ్ఞానవికాస సమన్వయ అధికారి అరుణ, మేఘన, సేవా ప్రతినిధి చైత్ర తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం నిర్వాహకులు తదితరులు

స్థానిక సమస్యలపై స్పందించండి



మరసూరు గ్రామసభలో పాల్గొన్న సభ్యులు తదితరులు

దొమ్మసంద్ర, జూలై 16: మరసూరు గ్రామపంచాయతీలో నెలకొన్న సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. 2024-25 సంవత్సరానికి తొలి సమావేశాన్ని మంగళవారం శంకర్‌నాగ్‌మందిరంలో నిర్వహించారు. అధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు మంజుళాలు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు 9 గంటలకు రావాల్సి ఉన్నా 11 గంటలకు వస్తున్నారని, పిల్లలకు పాఠాలు ఏం చెబుతారని మాజీ సభ్యులు మునిరాజు విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. ప్రధానమంత్రి అవాజ్దార్ యోజనెలో రూ.20 ఇన్సూరెన్స్ చేస్తే యాక్సిడెంట్‌కు రూ.2లక్షల బీమా ప్రభుత్వం నుంచి అం దుతుందని క్రైస్ట్ స్కూల్ తరపున అవగాహన కల్పించారు. డెంగీ జ్వరంపై ప్రజలకు అ వగాహ న కల్పిస్తున్న సందర్భంగా వైద్యాధికారులను నియమించాలని ప్రజలు కోరు తు న్నారన్నా రు. ప్రభుత్వ స్థలంలో 30ఏళ్లుగా ఇల్లుకట్టుకున్న పేదలకు 94సీసీ కింద హక్కుప త్రాలు కల్పించాలని గ్రామస్తులు గ్రామసభలో కోరారు. ఎస్సీ కారణంతో గ్రామ పంచాయతీ మహిళా సభ్యులకు గ్రాంట్లు విడుదల చేయడం లేదని విమర్శించారు. గ్రామసభలో సభ్యులు చంద్ర కళ, సరిత, ప్రభాకరరెడ్డి, కే మునియప్ప, కేబీ ఎల్లప్ప, కృష్ణప్ప, నాగప్ప, వెంకటస్వామిరెడ్డి, మంజుళ నారాయణరెడ్డి , సుధా, మణికంఠ, మునియమ్మ, ఆశా కార్యకర్తలు, పౌరకార్మికులు పాల్గొన్నారు.

గ్రామ దేవత దీపోత్సవం

శిడ్లఘట్ట, జూలై 16: గ్రామదేవత కాళికాంబ సమేత మహాశివుడు, ఆంజనేయస్వామి దేవతలకు ప్రత్యేక కార్యక్రమాలు, దీపోత్సవం ఘనంగా జరిగింది. తాలూకా మేలూరు గ్రామపంచాయతీ కంబదహళ్ళిలో జాతర జరిగింది. రెండు రోజులపాటు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. మూడు వారాలపాటు సన్నాహకాలు నిర్వహించడంతో జాతరలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో ఎటు చూసినా పండుగ వాతావరణం నెలకొంది. జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. దీపోత్సవం ఊరేగింపు కనులపండువగా సాగింది.



దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

27న చన్నసంద్రలో ఉద్యోగమేళా

మహదేవపుర, జూలై 16: నియోజకవర్గంలోని చన్నసంద్రలో ఈ నెల 27న ఉద్యోగమేళా జరగనుంది. శాసనసభ నియోజకవర్గం, మాజీ ఎమ్మెల్యే, మహదేవపుర టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు అరవింద లింబావళి, టాస్క్‌ఫోర్స్ పదాధికారులతో కలసి ఉద్యోగమేళా నిర్వహణపై ప్రత్యేకంగా సన్నాహకసభ జరిపినట్టు ఎమ్మెల్యే మంజుళా లింబావళి తెలిపారు. ఈనెల 27న చన్నసంద్రలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మేళా జరుగుతుందన్నారు. ప్రతి శక్తి కేంద్రం నుంచి ఇంటింటికి వెళ్లి నిరుద్యోగుల జాబితా సిద్ధం చేసి మేళాపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పదాధికారులు పాల్గొన్నారు. అర్హులైన వారు మేళాను వినియోగం చేసుకోవాలన్నారు.



మేళా వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే మంజుళా

బెంగళూరు నుంచి జోగ్‌కు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పశ్చిమ కనుమలు, తీర ప్రాంతాలకు జలకళ వచ్చింది. దేశంలోనే అతిపెద్ద జలపాతంగా పేరొందిన శివమొగ్గ జిల్లా జోగ్‌ను సందర్శించేవారికోసం కేఎస్‌ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీని ఏర్పాటు చేసింది. బెంగళూరు నుంచి శివమొగ్గకు ప్యాకేజీ బస్సులు విడుదల చేశారు. ఈనెల 19న శుక్రవారం, 20న శనివారంలలో రెండు కేఎస్‌ఆర్టీసీ బస్సులు జోగ్‌కు వెళ్లనున్నాయి. రాత్రి 8.30 గంటలకు మెజస్టిక్ నుంచి బయల్దేరి ఉదయం 5.30 గంటలకు సాగరకు చేరుతాయి. అక్కడ హోటల్‌లో విశ్రాంతి తీసుకుని టిఫిన్ తర్వాత వరదహళ్ళి మీదుగా ఇక్కేరి నుంచి సాగర వైపు వెళ్తారు. మధ్యాహ్నం 1గంటకు భోజనం తర్వాత జోగ్ జలపాతానికి తీసుకెళ్తారు. సాయంత్రం 6.15 గంటలకు జోగ్‌నుంచి బయల్దేరి 7 గంటలకు సాగరకు చేరుకుంటారు. 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బెంగళూరుకు వచ్చేందుకు వీలుంది. హుబ్బళ్ళి నుంచి కూడా జోగ్‌కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు వాయువ్య ఆర్టీసీ ప్రకటించింది.

పైనుంచి పడి ఎలక్ట్రీషియన్ మృతి



మృతుడు భరత్

ధర్మవరం రూరల్, జూలై 16: మండలంలోని పోతుకుంట ఎస్సీ కాలనీలో శ్రీలక్ష్మీనర సింహస్వామి ఆలయం పైన విద్యుత్ పనులు చేస్తు న్న ఓ యువకుడు ఛాతిలో నొప్పి రావడంతో మర ణించాడు. బెంగుళూరుకు చెందిన భరత్ (26) గ్రా మంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంపైన విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేస్తుం డగా.. ఛాతి నొప్పి రావడంతో పై నుంచి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు విద్యుదాఘాతానికి గురయ్యాడని భావించి.. వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. అయితే అప్పటికే అతను మరణిం చినట్లు.. ఆతను విద్యుదాఘాతంతో కాద ని, గుండెపోటుతో మర ణించాలని వైద్యులు స్పష్టం చేశారు. స్థానికులు విషయాన్ని బెంగు ళూరులోని అతని కుటుంబ సభ్యులకు, బంధువులకు తెలి పారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, జూలై 16: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 398 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 16: ఉమ్మడి అనంతపురం జిల్లాలో దివ్యాంగులైన విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల ఏడీ అబ్దుల్ రసూల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 9, 10 తరగతులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ ఆపై చదువులు చదువుతున్న దివ్యాంగులు www.scholarships.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఆగస్టు 31, ఇంటర్ ఆపై తరగతుల విద్యార్థులు అక్టోబరు 31 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూలై 16: జాతీయ స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులు- 2024కు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 21 వరకూ అవకాశం ఉందని డీఈఓ వరలక్ష్మి మంగళవారం తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ప్రైమరీ, అప్పర్‌ప్రైమరీ, హైస్కూళ్ల టీచర్లు, హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత, ధ్రువీకరణ అధికారితో ధ్రువీకరించి డీఈఓ ఆఫీస్‌లో అందజేయాలన్నారు.

అంబులెన్స్ కోసం సిగ్నల్ జంప్‌నకు... జరిమానా మినహాయింపు

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులకంటే డేగకన్నులాంటి ఏఐ సీసీ కెమెరాలను నగర వ్యాప్తంగా అమర్చారు. సిగ్నల్ జంప్ చేసినా, హెల్మెట్ లేకున్నా, ఎటువంటి ఉల్లంఘనలకు పాల్పడిన ఇక జరిమానా తప్పదనేలా మారిపోయింది. అయితే నగరంలో అంబులెన్స్‌లకు దారి ఇచ్చే సందర్భంలో సిగ్నల్ జంప్ చేస్తే జరిమానా విధించకుండా ఉండేలా మినహాయింపు ఇచ్చారు. ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ తెలిపిన మేరకు అంబులెన్స్‌కు దారి ఇచ్చే విషయంలో సిగ్నల్ జంప్ చేసినా కెమెరాలు అటువంటి దృశ్యాలను పరిశీలించి జరిమానా నుంచి ఉపసంహరిస్తాయన్నారు. కర్ణాటక స్టేట్ పోలీస్ అప్లికేషన్ ద్వారా సమాచారం అందించవచ్చునన్నారు. జీపీఎస్ ద్వారా అంబులెన్స్‌ను గుర్తించి ట్రాఫిక్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా పది జంక్షన్‌లలో జియోఫెన్సింగ్ అమర్చామని ఈ మార్గాలలో 80 అంబులెన్స్‌లకు జీపీఎస్‌లను అమర్చినట్లు తెలిపారు.

జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు శ్రీకారం

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీఎన్‌బీ మెట్‌లైఫ్ 8వ విడత జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు మంగళవారం బెంగళూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. సంస్థ సీఎండీ సమీర్ బన్సాల్ అభిప్రాయం మేరకు బెంగళూరు, హైదరాబాద్‌తోపాటు దేశంలోని పది నగరాలలో యువ క్రీడాకారులను పరిచయం చేసేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 1న ఢిల్లీలో ప్రారంభమవుతాయని ఆ తర్వాత నగరాల వారీగా కొనసాగిస్తామన్నారు.

పెట్రోల్ చల్లి గుడిసెకు నిప్పు - ఇద్దరు మహిళల సజీవదహనం

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లా ముధోళ తాలూకాలో దుర్మార్గుల చర్యలకు ఇద్దరు మహిళలు సజీవదహనమయ్యారు. బెళగళిలో సోమవారం రాత్రి గుడిసెకు పెట్రోల్ చల్లి నిప్పు పెట్టడంతో జైబాన్ (55), షబాన్ (25) సజీవదహన మయ్యారు. దస్తగిరిసాబ్, సుబహాన్‌లు తీవ్ర గాయాల పాలై ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ముధోళ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



పాదయాత్రతో వస్తున్న మరాఠా భక్తులు

పుట్టపర్తి, జూలై 16: ప్రశాంతి నిలయంలో మంగళవారం ఆషాఢమాస ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయికుల్వంతు మందిరంలో వేదపఠనంతో వేడుకలు మొదలయ్యాయి. అనంతరం గంట పాటు సత్యసాయి ప్రేమతత్వంపై భక్తిగీతాలాపన చేశారు. సాయంత్రం హర్షవర్ధన్ బృందం సంగీత గానకచేరిని నిర్వహించారు. మధురమైన వాయిద్య, గానంతో భక్తులను ఘమైమరిపించారు. ఈ సందర్భంగా సాయి కుల్వంతు మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

పాదయాత్రతో పుట్టపర్తికి చేరిన మరాఠా భక్తులు

ప్రతి ఏడాది మరాఠా భక్తులు ఆషాఢ ఏకాదశి ఉత్సవాలలో పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. వీరు మహారాష్ట్ర నుంచి రైలుమార్గాన ధర్మవరం చేరుకున్నారు. అక్కడి నుంచి పాదయాత్రగా మంగళవారం రాత్రి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 16: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బెంగళూరు-కలబురగి మధ్య (వయా గుంతకల్లు) ఓ అప్ అండ్ డౌన్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-కలబురగి ప్రత్యేక రైలు (నెం. 06533) ఈ నెల 19 రాత్రి 8 గంటలకు బెంగళూరులో బయలుదేరి శనివారం తెల్లవారుజాము 12-40 గంటలకు అనంతపురం చేరుకుని, గుంతకల్లుకు ఉదయం 2-05 గంటలకు వచ్చి, కలబురగి స్టేషన్‌కు ఉదయం 7-45 గంటలకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06534) కలబురగిలో 20న ఉదయం తొమ్మిదిన్నరకు బయలుదేరి గుంతకల్లుకు మధ్యాహ్నం 2 గంటలకు, అనంతపురం మధ్యాహ్నం 3.-07 గంటలకు వస్తుందని, బెంగళూరుకు అదే రోజు రాత్రి ఎనిమిదిన్నరకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్, షాహాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు.

కసాపురంలో వైసీపీ నాయకుల దందా

లే అవుట్లు వేయకుండా ప్లాట్ల విక్రయం
గుట్టను కబళించినా పట్టని అధికారులు

గుంతకల్లు, జూలై 16: వైసీపీ అధికారం కోల్పోయి నెల గడిచినా.. ఆ పార్టీ నాయకుల కబ్జాల పర్వం ఆగడం లేదు. దోనిముక్కల రోడ్డులో ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్నారు. కసాపురం గుట్టపై కన్నేశారు. పెద్ద గుట్టను చదునుచేసి ప్లాట్లుగా మారుస్తున్నారు. కసాపురంలో ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డు భూములను అమ్మి సొమ్ము చేసుకునే పనిలోపడ్డారు. ప్రభుత్వ భూమిలో లే అవుట్ వేయకుండా.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలో మాట్లాడుకుని.. అగ్రిమెంట్లపై అమ్ముకుంటున్నారు. ఆలస్యం చేస్తే స్థలాలు చేజారి పోతాయని యంత్రాలు పెట్టి మరీ గుట్టను చదునుచేసి అమ్మేస్తున్నారు.

అసైన్డు భూములే టార్గెట్

కసాపురంలో రహదారికి ఇరువైపులా అసైన్డు భూములు ఉన్నాయి. లబ్ధిదారులకు అంతో ఇంతో ఇచ్చి ఆ భూములను వైసీపీ నాయకులు కొంటున్నారు. వాటిని ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన పీఎస్‌సీ వసతి గృహానికి సమీపంలో పడమటి రోడ్డుకు ఆవల ఉన్న గుట్టను కరిగించి ప్లాట్లుగా మార్చేస్తున్నారు. సాధారణంగా ప్లాట్లు అమ్మాలంటే మొదట లే అవుట్ వేస్తారు. హద్దు రాళ్లను పాతి అమ్మకాలు మొదలు పెడతారు. కానీ కసాపురంలో గంపగుత్తగా అమ్మేస్తున్నారు. సెంటు రూ.50 వేలు, రూ.60 వేల ప్రకారం.. ఎవరికి ఎన్ని సెంట్లు కావాలంటే అన్ని సెంట్లు కొలిచి ఇస్తున్నారు. కసాపురంలో రోడ్ల పక్కన ప్రైవేటు భూమి ఎకరా రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లదాకా రేటు పలుకుతోంది. అటువంటిది సెంటు కేవలం రూ.50 వేలకు దొరుకుతుండటంతో హాట్ కేకుల్లా అమ్ముడౌతున్నాయి. కసాపురం గ్రామానికి చెందిన డి.పుల్లన్న అనే రైతుకు సర్వే నంబరు 201-బీలో 5.20 ఎకరాల భూమి ఉంది. దీన్ని ఆయన ఇద్దరు కొడుకులు చెరి సగం పంచుకున్నారు. అందులో తన వాటాగా వచ్చిన 2.60 ఎకరాలను పుల్లన్న కుమారుడు సుంకన్న వైసీపీ నాయకులకు అమ్మేశారు. దాన్ని వైసీపీ నాయకులు ప్లాట్లుగా విడగొట్టి విక్రయిస్తున్నారు.

అమ్మకానికి మరిన్ని..

కసాపురం పరిధిలో అత్యంత విలువైన అసైన్డు భూములను కొందరు కొనుగోలు చేసి.. లే అవుట్లు వేసేపనిలో పడ్డారు. బుగ్గసంగాల వద్ద ఉన్న సర్వే నంబరు 8లో రెండెకరాల పైచిలుకు భూమిని, కసాపురం ఆలయానికి ఆవల మూతబడిన టైర్ల ఫ్యాక్టరీ వద్ద ఉన్న 278 సర్వే నంబరులో 4 ఎకరాల అసైన్డు భూమిని కొందరు కొని.. ప్లాట్లు వేస్తున్నారు. కసాపురం శివారులో.. గుంతకల్లు రోడ్డులోని 270-ఏ సర్వే నంబరులో దాదాపు మూడున్నర ఎకరాల అసైన్డు భూమిని గతంలో వైసీపీ నాయకులు ఆక్రమించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ప్లాట్లు వేయరాదని హెచ్చరిస్తూ బోర్డులు పెట్టారు. ఆ తర్వాత బోర్డులను తొలగించి ప్లాట్లు వేసి అమ్మేశారు. సెంటు రూ.6 లక్షల ప్రకారం అమ్మేసి.. సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఇంటి స్థలాలు సెంటు లేదా, ఒకటిన్నర సెంటు, మహా అయితే రెండు సెంట్ల ప్లాట్లు ఉంటాయి. కానీ ఈ సర్వే నంబరులో రోడ్డుకు ఇరువైపులా భారీ ఇళ్లను నిర్మిస్తున్నారు.



201-బీ సర్వే నెంబరులో గుట్టపైన తవ్వి చదును చేసిన దృశ్యం

అధికారుల మీనమేషాలు

కసాపురంలో వైసీపీ నాయకుల దందా గురించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఎన్నికల డెప్యుటేషన్ పూర్తయితే బదిలీపై వెళ్లిపోతామని.. తమకెందుకు ఈ గొడవలన్నీ అన్నట్లు కాలయాపన చేస్తున్నారు. కసాపురంలోని 201-బీ సర్వే నంబరులో ఆక్రమణలను తహసీల్దారు శేషపణి వెళ్లి పరిశీలించారు. కానీ చర్యలు తీసుకోలేదు.